# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-01-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌ను మత్తు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు.**

2. **భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రెండు రోజుల్లో లక్షా 21 వేల పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.**

3. **రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**

4. **రాష్ట్రపతి ద్రౌపదీముర్ము జీవితం యువతకు ఆదర్శమని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు చెప్పారు.**

5. **ప్రతి ఏప్రిల్ లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌ను మత్తు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖ రేంజి పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో 53 రోజులుగా 1300 కిలోమీటర్ల మేర సాగిన 'అభ్యుదయం' సైకిల్ యాత్ర ఇచ్చాపురంలో నిన్న ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్‌ను హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. యువతలో నైపుణ్యాల పెంపునకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం యువత కేవలం శ్రమశక్తిపైనే కాకుండా, ఆధునిక సాంకేతికత, నైపుణ్యాల కలయికతో ప్రపంచస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

--------------------------

భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రెండు రోజుల్లో లక్షా 21 వేల పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెలలాఖరు నాటికి 22 లక్షల పాస్ పుస్తకాలు రైతులకు అందజేస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సమస్యలు ఉంటే వాటిని గ్రామ సభల్లో అధికారుల దృష్టికి తీసుకువచ్చి.. నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ సభల్లో అన్ని రికార్డులు అందుబాటులో

ఉంటాయన్నారు. అత్యధికంగా కర్నూలు జిల్లాలో 19 వేల 730 పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

---------------------------

రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఉల్లి రైతులకు హెక్టారుకు 50 వేల రూపాయల చొప్పున వారి ఖాతాల్లో మంత్రి నిన్న జమ చేశారు. కర్నూలు జిల్లా కోడుమూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో మరో మంత్రి టి.జి భరత్ తో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

మారిషస్ దేశాధ్యక్షులు ధరంబీర్ గోకుల్ జిసిఎస్కేకు ఆంధ్రప్రదేశ్ లోని గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. నిన్నటి నుంచి ఆరు రోజుల భారతదేశ పర్యటనలో భాగంగా గన్నవరం విమానాశ్రయానికి కుటుంబ సమేతంగా నిన్న సాయంత్రం చేరుకున్న ఆయనకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కృష్ణా జిల్లా కలెక్టర్ డికె బాలాజీ ఘన స్వాగతం పలికారు. అనంతరం మారిషస్ దేశాధ్యక్షులు గుంటూరుకు చేరుకున్నారు. నేడు గుంటూరులో జరుగుతున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన పాల్గొననున్నారు.

---------------------------

రాష్ట్రపతి ద్రౌపదీముర్ము జీవితం యువతకు ఆదర్శమని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. ఓ సామాన్య మహిళ.. పట్టుదలతో చదువుకుని, అంచెలంచెలుగా ఎదిగి.. దేశమే గర్వించే స్థాయికి చేరిన విధానం ప్రతి ఒక్కరికీ దిక్సూచి వంటిదని వెల్లడించారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రచించిన 'అగ్ని సరసులో వికసించిన కమలం ద్రౌపదీముర్ము' అనే పుస్తకాన్ని విజయవాడలోని నిన్న నిర్వహించిన ఒక కార్యక్రమంలో కంభంపాటి హరిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్..38 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం జిల్లా భోగాపురం గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోలకు సంబంధించి ట్రైల్ రన్ ఈరోజు నిర్వహించనున్నారు. ఢిల్లీ నుంచి బయలుదేరే ఎయిర్ ఇండియా విమానం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విమానయాన శాఖ అధికారులతో ఈ ఉదయం భోగాపురం రానుంది. ఈ చివరి ట్రయల్ రన్ విజయవంతమైతే, ఈ ఏడాది మే నెల నుంచే ఎయిర్‌పోర్ట్ నుంచి రాకపోకలు సాగించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ విమానాశ్రయంలో మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే విధంగా టెర్మినల్ నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో కోటి 80 లక్షల వరకూ రాకపోకలు సాగించే విధంగా అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

---------------------------

ప్రతి ఏప్రిల్ లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. శాసన సభలో నిన్న ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని చెప్పారు. రానున్న 3 విడతల్లో పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొంటూ..

వాయిస్.. 34 సెకన్లు

---------------------------

కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన ఒక్క నీటి బొట్టు కూడా వదలుకోమని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. శాసన సభలో నిన్న ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం కృష్ణా గోదావరి నది జలాల నుండి తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల విషయంలో ఒక్క చుక్కను కూడా వదిలిపెట్టదని స్పష్టం చేశారు. కృష్ణా నది జలాలపై నల్గొండ, ఖమ్మం జిల్లాల రైతులు ఆదారపడి ఉన్నారని చెప్పారు. నీటి హక్కులు కాపాడటంలో ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తుందన్నారు.

---------------------------

కొత్తగా తీసుకువచ్చిన విబిజీ రామ్ జీ చట్టంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఎపిడి పి.రాధ చెప్పారు.. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మండల అభివృద్ధి అధికారులతో సమావేశాన్ని నిన్న నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేపు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో వికసిత భారత్.. గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టంపై గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు.

---------------------------

కోస్తా ఆంధ్ర ప్రదేశ్, యానాం మరియు రాయలసీమలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి లోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తా, రాయలసీమలలో ఈ రోజు, రేపు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలిపారు. దట్టమైన పొగమంచు అక్కడక్కడా కురిసే అవకాశము ఉందని అయన వివరించారు.

తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం వెల్లడిచింది. రాష్ట్రంలో అక్కడక్కడా దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

దట్టమైన పొగమంచు కారణంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది నెలకొంది.

---------------------------

అంధుల కోసం ప్రత్యేక లిపిని రూపొందించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయులు లూయీ బ్రెయిలీ జయంతి ఈరోజు 1809 జనవరి 4వ తేదీన ఫ్రాన్స్‌లోని “క్రూవేలో” జన్మించిన బ్రెయిలీ తన పరిశోధనల ద్వారా అంధులకు ప్రత్యేక లిపి ని సృష్టించి గొప్ప మార్పుకు నాంది పలికారు. ఆయన జయంతిని పురస్కరించుకొని జనవరి 4వ తేదీని ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. అతి కీలకమైన అంశాన్ని శోధించి అంధులకు దిక్సూచిగా నిలిచిన బ్రెయిలీ 1852 జనవరి 6వ తేదీన 43 ఏళ్ళ వయసులో కన్నుమూశారు..

====================